# ఏటీఎంలో చోరీ చేయబోతే

# పోలీస్ ఫోన్ మోగుతుంది

**• సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం ఆవిష్కరణ**



అలారం పనిచేసే విధానాన్ని వివరిస్తున్న సంస్థ ప్రతినిధులు

బెంగళూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఏటీఎంలలో చోరీలు ఇటీవలి కాలంలో బాగా పెరిగిపోతున్న నేపథ్యంలో వాటిని అరికట్టేందుకు సెక్యూరెన్స్ అనే సాంకేతిక సంస్థ సరికొత్త పరికరాన్ని కనిపెట్టింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ ఆర్ ఉడుప సరికొత్త సాంకేతిక పరిజ్ఞానానికి రూపుకల్పన చేశామని బెంగళూరులో మంగళవారం మీడియా సమావేశంలో తెలిపారు. ఏకంగా ఏటీఎంలనే దొంగలు ఎత్తుకుపోతున్న నేపథ్యంలో తాము వాటికి నిరంతర నిఘా వ్యవస్థను కల్పించే యాక్టివ్ డిటెరెన్స్‌కు శ్రీకారం చుట్టామన్నారు. ఈ వినూత్న సాంకేతిక పరిజ్ఞానం కారణంగా ఏటీఎంలలో దొంగలు చోరీకి ప్రయత్నించే సమయంలో అలారం మోగుతుంది. అక్కడ అలారం ఉందన్న సంగతి దొంగకు సైతం తెలియనంత గుట్టుగా ఉంటుంది. అలారం మోగడంతోపాటు ఏటీఎం దోపిడీకి ప్రయత్నం జరుగుతోందన్న సమాచారం తక్షణం సమీప పోలీస్ స్టేషన్‌కు అందుతుంది. దీంతో పోలీసులు అప్రమత్తమై దొంగలను పట్టుకునేందుకు సాధ్యపడుతుందని సునీల్ ఆర్ ఉడుప తెలిపారు. బ్యాంకులకు, ఏటీఎంలకు భద్రత కల్పించే దిశగా సెక్యూరెన్స్ సిస్టమ్స్‌ను 2012లో ఏర్పాటు చేశామని, దేశ వ్యాప్తంగా 1800కుపైగా ఏటీఎంలను కేంద్ర నియంత్రణా నిఘా వ్యవస్థ పరిధిలోకి తెచ్చామన్నారు. మరో 2 వేల ఏటీఎంలను దీని పరిధిలోకి తెచ్చే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిపారు. బెంగళూరులో 400కుపైగా ఏటీఎంలకు ఈ భద్రతా సౌకర్యం ఉందన్నారు. నెలకు రూ.12 వేల ఖర్చుతో ఏటీఎంలకు పరిపూర్ణ భద్రత కల్పించవచ్చునన్నారు. మూడు షిఫ్టులలో ఏటీఎంలకు సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయడం వల్ల నెలకు సుమారు రూ.37 వేలు ఖర్చు అవుతుందన్నారు. ఈ సరికొత్త నిఘా వ్యవస్థ వల్ల ఏటీఎం భద్రత పరిపూర్ణంగా ఉండడంతోపాటు నిర్వహణ ఖర్చు కూడా గణనీయంగా తగ్గుతుందన్నారు.